క్లుప్తంగా

అనారోగ్యంతో అమ్డాపూర్ మాజీ సర్పంచ్ మృతి



అమ్డాపూర్ గాంధీ చౌరస్తా వద్ద చంద్రకళ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అమ్డాపూర్ మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ షాపురం చంద్రకళ ఆదివారం ఉదయం మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, జిల్లాలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు. గ్రామంలో గాంధీ చౌరస్తా వద్ద యువజన సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె సేవలను గుర్తుచేసుకున్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: యువత స్వయం ఉపాధిలో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముదిగొండ రవియాదవ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఆదివారం యువకులు ఇమ్రాన్, ఇర్ఫాన్ కలిసి స్వయం ఉపాధి కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముదిగొండ రవియాదవ్ పాల్గొని మాట్లాడుతూ.. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కలిసిమెలిసి పోవాలన్నారు. అప్పుడే ఎంచుకున్న ఉపాధి ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ కుటుంబ పోషణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువకులు ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హిమాయత్‌నగర్ మాజీ ఉపసర్పంచ్ శ్యామ్‌రావు, శాంతియువజన సంఘం మాజీ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్, మహేందర్‌యాదవ్, అశోక్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోండి



సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

శంకర్‌పల్లి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు శంకర్‌పల్లి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కో–ఆర్డినేటర్లు మద్దిలేటి, ప్రశాంత్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనకు మంద కృష్ణ మాదిగ అనేక పోరాటాలు చేపట్టారన్నారు. అలాంటి వ్యక్తిపై భౌతిక దాడులు చేసి, చంపేయాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన పసుల రామ్మూర్తిపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మరో విధంగా స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్, ఎంఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాని భాను, జిల్లా ఉపాధ్యక్షుడు వన్నెపాగ వంశీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీయూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న గ్రంథాలయ చైర్మన్, టీయూటీఎఫ్ నాయకులు

శంకర్‌పల్లి: విద్యార్థులకు పాఠశాల దశ నుంచే పుస్తక పఠనంపై అవగాహన కల్పించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం హైదరాబాద్‌లో టీయూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో గ్రంథాలయాలను బలోపేతం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో టీయూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు డేవిడ్, ప్రధాన కార్యదర్శి ఎండీ మునీర్, శంకర్‌పల్లి పీఏసీఎస్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అంజయ్య, శ్రీనివాస్ చారి, శివానందం తదితరులు పాల్గొన్నారు.

మామిడితోట.. విరగబూత





షాబాద్ మండల కేంద్రంలోని ఓ మామిడి తోటలో పూత విరగకాసింది. బంగారం వర్ణంలో మామిడిపూత ఎర్రగా పూసి చూపరులను ఆకట్టుకుంటోంది. గత సంవత్సరం మామిడి చెట్లకు పూత, కాత అంతంత మాత్రంగానే కాసింది. ఈ సంవత్సరం ఎక్కడ చూసినా మామిడి పూత విరగబూసింది. ఈ దృశ్యాలను ఆదివారం 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. – షాబాద్

క్రీడలతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన నందిగామ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను ప్రోత్సహించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. యువత, విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో రాణించాలని కోరారు. ముఖ్యంగా తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో మరింత నైపుణ్యాలను సాధించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని సూచించారు. క్రీడలతో శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు ఏకాగ్రత ఏర్పడుతుందన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్‌లో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం టోర్నమెంట్ నిర్వహణకు రూ.2లక్షలు అందిస్తున్న మాజీ సర్పంచ్ కొమ్ము కృష్ణను ఎమ్మెల్యే అభినందించారు. క్రీడాకారులు, స్థానిక నాయకుల కోరిక మేరకు మండల కేంద్రంలో క్రీడల నిర్వహణకు స్థలాన్ని కేటాయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, నాయకులు జంగ నర్సింహ, రాంరెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, కుమారస్వామిగౌడ్, జంగయ్య, జగన్, తుమ్మల నర్సింహ, జ్ఞానేశ్వర్, టోర్నమెంట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి గెలుపునకు నాంది



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి, నిర్వాహకులు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

షాబాద్: ఓటమి గెలుపునకు నాంది కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మల్లీ మహేశ్ తండ్రి కీర్తిశేషులు మల్లీ జంటయ్య స్మారకార్థం మండల స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు మధుసూదన్‌రెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో షాబాద్ జట్టు మొదటి బహుమతి రూ.10వేల నగదు, రెండో బహుమతి నాగర్‌కుంట జట్టుకు రూ.5వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ ఉంటేనే విజయాలు వరిస్తాయన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, పార్టీ నాయకులు సుభాష్‌రెడ్డి, కిషోర్‌నాయక్, దయాకర్, రఫీక్, సాయి, జలీల్, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్‌రావు



నూతన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని సన్మానిస్తున్న నర్సింగ్‌రావు

చేవెళ్ల: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు శేరి నర్సింగ్‌రావు అన్నారు. చేవెళ్లలో ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అత్తెల్లి అనంత్‌రెడ్డిని ఆయన శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రోజురోజుకు బలోపేతం అవుతుందని, యువత ఎంతో ఉత్సాహంగా పార్టీ కోసం పనిచేస్తున్నారన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకెళ్తే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటుతుందన్నారు. రాష్ట్రంలో పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే వరకు ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తూ మండల కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించి మండలంలోని అన్ని గ్రామ కమిటీలను కూడా వేసుకోవాలని సూచించారు. అందరం కలిసి పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు విఠల్‌రెడ్డి, యువ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మల్గారి భార్గవ్‌రెడ్డి, జయసింహ, మహేశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేసారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో..

మండలంలోని కేసారం గ్రామానికి చెందిన బీజేపీ గ్రామ కమిటీ సభ్యులు ఆదివారం నూతన మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డిని సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేసారం గ్రామ నాయకులు కె. మహేందర్, సంజీవ్‌రెడ్డి, నాగరాజ్‌గౌడ్, రఘు, వినయ్, కుమార్, మహేందర్ తదితరులు ఉన్నారు.

సుందరం.. సూర్యోదయం





చలికాలంలో కనిపించే ప్రతీ సూర్యోదయం కనువిందుగానే ఉంటుంది. మంచు మబ్బులను చీల్చుకుంటూ వచ్చే భానుడి బంగారు రంగు కిరణాలు మనసును హత్తుకుంటాయి. పచ్చని పంట పొలాలు, కిలకిల రాగాలు చేసే పక్షులతో కూడిన పల్లె సీమ అందాల నడుమ కనిపించే భానూదయం చూడముచ్చట గొలుపుతుంది. షాబాద్ మండల కేంద్రంలోని పైల్వాన్ చెరువులో కనిపించిన ప్రకృతి రమణీయ చిత్రాన్ని ఆదివారం 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది. – షాబాద్

ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదం

బీఆర్‌ఎస్ నాయకుడు సామ రంగారెడ్డి



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న గ్రామ నాయకులు

చేవెళ్ల: యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు దోహదపడతాయని బీఆర్‌ఎస్ నాయకుడు సామ రంగారెడ్డి అన్నారు. చేవెళ్ల మండలంలోని దేవునిఎర్రవల్లి గ్రామంలో డీపీఎల్ సీజన్ వన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ పోటీలో విజేతలకు బహుమతులు ఆయన అందజేశారు. ఈ పోటీలో కెప్టెన్ విజయ్‌కాంత్ టీం విజయం సాధించింది. గ్రామానికి చెందిన చింపుల బుచ్చిరెడ్డి విజేతకు 10వేల రూపాయలు, ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు మాణిక్యం, ఎదిరే కుమార్, లాలయ్య పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై దాడి హేయమైన చర్య

శంకర్‌పల్లి: విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేయడం హేయమైన చర్య అని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచిరాం, ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని తుక్కుగూడ జిల్లా పరిషత్ పాఠశాలలో విధి నిర్వహణలో ఉన్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై దుండగులు దాడికి పాల్పడడంపై ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో దాడికి నిరసనగా సోమవారం ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసనలు తెలపనున్నట్లు పేర్కొన్నారు. దాడికి పాల్పడిన దుండగులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం

యాచారం: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన గడ్డం లక్ష్మయ్యకు సీఎంఆర్‌ఎఫ్ కింద రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని ఆదివారం నగరంలోని తన నివాసంలో అందజేసి మాట్లాడారు. అనారోగ్యానికి గురైన పేదలు.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖరైదన వైద్యం చేయించుకోవడానికి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు శ్రీశైలం, నాయకులు జంగయ్య, జయప్రకాశ్, మల్లేశ్, చింటుగౌడ్, బండరాజు, మహేశ్, అర్జున్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ఇబ్రహీంపట్నం: సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరగనున్న సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నేతలు కోరారు. ఆదివారం దండుమైలారం గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు జగన్ మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను మహాసభల్లో రూపొందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లింగస్వామి, రమేష్, చరణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సాగు భూములకే రైతు భరోసా



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి, డిప్యూటీ తహసీల్దార్

మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి

మొయినాబాద్‌రూరల్: సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతు భరోసా అందించేందుకు కృషి చేస్తున్నామని మండల వ్యవసాయ అధికారి అనురాధారెడ్డి, మండల డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్ పేర్కొన్నారు. సెలవురోజు ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కలిసి భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించి సర్వే నెంబర్ల ఆధారంగా రైతుల భూములను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయం చేసుకునేందుకు అనువుగా ఉన్న భూములకే రైతు భరోసా అందిస్తుందన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా జాబితా నుంచి ప్రభుత్వం తొలగించేందుకు ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. గ్రామాల్లోని భూములను గూగుల్ మ్యాప్ ద్వారా గుర్తిస్తున్నామని వాటన్నింటి వివరాలను గ్రామంలో నిర్వహించే గ్రామ సభల్లో చర్చించి ప్రజల ఆమోదం తీసుకుంటామన్నారు. వ్యవసాయేతర భూములుగా మారిన వాటికి రైతు భరోసా పథకం వర్తించదని తెలిపారు. కార్యక్రమంలో మండల ఆర్‌ఐ సుజిత్‌రెడ్డి, ఏఓ సునీల్, కుమార్, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

కొందుర్గు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతుభరోసా పథకం అమలుపై నిర్వహిస్తున్న సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డీఓ సరిత సూచించారు. ఆదివారం ఆమె జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని సందర్శించి అధికారులు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతుభరోసా పథకం జాబితా నుంచి తొలగించేందుకు ప్రతిపాదించాలన్నారు. అదే విధంగా అర్హులందరికీ ప్రభుత్వం అందించనున్న పథకాలు అందేలా చూడాలని సూచించారు.



చౌదరిగూడలో భూములపై ఆర్డీఓ సరితకు వివరిస్తున్న అధికారులు

కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఏఓ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

మామిడిపల్లి బస్సును పునరుద్ధరించండి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డీఎంకు వినతి

షాద్‌నగర్: గతంలో ఉన్న విధంగా షాద్‌నగర్ నుంచి మామిడిపల్లి గ్రామం వరకు బస్సును పునరుద్ధరించాలని పలువురు నాయకులు ఆర్టీసీ డిపో మేనేజర్ ఉషను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం డీఎంకు వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ నుంచి నందిగామ మండలం మామిడిపల్లి గ్రామం వరకు బస్సు నడిపించే వారని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం ఈ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాద్‌నగర్ నుంచి అప్పారెడ్డిగూడ, వీర్లపల్లి, చెర్ల అంతిరెడ్డిగూడ, మొదళ్లగూడ, మజీదు మామిడిపల్లి, మామిడిపల్లి గ్రామాలకు ఉదయం, సాయంత్రం బస్సును నడిపించాలని కోరారు. మారుమూల గ్రామాల నుంచి ఎంతో మంది ప్రజలు, విద్యార్థులు, కార్మికులు ప్రతి రోజు పట్టణానికి వివిధ పనుల నిమిత్తం రాకపోకలు కొనసాగిస్తుంటారని, అధికారులు స్పందించి మామిడిపల్లి బస్సును తిరిగి ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ కొమ్ము కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ సీతారాం, తదితరులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడలు ప్రధానం



విజేత జట్లకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతంలోని యువత ఉన్నత చదువులతో పాటు క్రీడా రంగంలో రాణించాలని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో బీజేపీ మండల కార్యదర్శి గుమ్మళ్ల సీతారాంరెడ్డి నిర్వహించిన సురంగల్ ప్రీమియర్ లీగ్(ఎస్‌పీఎల్) క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్, గుజరాత్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. చివరకు హైదరాబాద్ జట్టు విజయం సాధించి టైటిల్ సాధించింది. గుజరాత్ జట్టు రెండో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతంలోని క్రీడాకారులు తమ ప్రతిభను పెంచుకునేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యువత, క్రీడాకారులను ప్రోత్సహిస్తూ సీతారాంరెడ్డి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. విజయం సాధించిన జట్టుకు రూ.20వేలు నగదుతోపాటు షీల్డు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10వేలు నగదు, షీల్డు అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సన్‌వెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎం.శ్రీకాంత్, కోశాధికారి ప్రభుయాదవ్, కెప్టెన్‌లు మహేశ్ రెడ్డి, సందీప్, నాయకులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

శంకర్‌పల్లి: మండలంలోని మహాలింగాపురంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో 2005–06 బ్యాచ్‌కి చెందిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. 19 ఏళ్ల తర్వాత వారందరూ ఒకచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రోజంతా ఆటాపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనకమామిడి జెడ్పీ పాఠశాలలో..

మొయినాబాద్: మండల పరిధిలోని కనకమామిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం మొయినాబాద్‌లోని ఓ ఫాంహౌస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చదువుకునే రోజుల్లోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. యోగక్షేమాలు తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



మొయినాబాద్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు